క్లుప్తంగా

శ్రీశైలంలో ఇచ్ఛాపురం నాట్యకారుల ప్రదర్శన



నాట్యప్రదర్శన చేస్తున్న వేంకటేశ్వర నాట్యకారులు

ఇచ్ఛాపురం: శ్రీశైలం మల్లికార్జున భ్రమరాంబిక దేవస్థానం సన్నిధిలో ఈ నెల 13న నిర్వహించిన ధర్మపథం సాంస్కృతిక నాట్యప్రదర్శనలలో ఇచ్ఛాపురం పట్టణానికి చెందిన శ్రీవేంకటేశ్వర మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ నాట్యకారులు కూచిపూడి నృత్యాలతో అలరించారని అకాడమీ అధ్యక్షుడు చిన్నాగురుస్వామి గురువారం తెలిపారు. నాట్యగురువు శృతి పట్నాయక్ ఆధ్వర్యంలో డి.కావ్య, శైలు, పూజశ్రీ, జయలక్ష్మి, శ్వేతా, ప్రీతీ, కె.లక్ష్మి సింధు, పల్లవి, లిఖిత, శ్రీదీక్షిత, ప్రణవి, స్నేహశ్రీ, సోనాక్షి, మధుశ్రీ, జాగృతి, జైత్రి కాత్యాయని, సౌమ్యలు కూచిపూడి నృత్యాలతో అలరించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు నాట్యకారులను ఘనంగా సత్కరించారు.

నందిగాం ఎస్ఐగా మహమ్మద్ అలీ



షేక్ మహమ్మద్ అలీ

నందిగాం: నందిగాం ఎస్ఐగా షేక్ మహమ్మద్ అలీ శనివారం బాధ్యతలు స్వీకరించారు. కోటబొమ్మాళి పోలీస్ స్టేషన్ నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇప్పటి వరకు ఇక్కడ పనిచేసిన మహమ్మద్ అమీర్ అలీ వీఆర్‌లో ఉన్నారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ మండలంలో శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయంగా విధులు నిర్వహిస్తానని, అందరూ సహకరించాలని కోరారు.

కంచమ్మ ఆలయ అభివృద్ధికి విరాళం



విరాళాన్ని అందిస్తున్న దాత

కంచిలి: మండల కేంద్రం కంచిలిలో కొలువై ఉన్న కంచమ్మతల్లి దేవస్థానంలో నూతన మండపం అభివృద్ధి కోసం సోంపేటకు చెందిన కొత్తకోట వెంకట నరసింహమూర్తి శనివారం రూ.51వేల విరాళం అందించారు. పంచాయతీ సెక్రటరీగా పనిచేసిన దివంగత పైల వెంకయ్య జ్ఞాపకార్థం ఆయన భార్య గోపమ్మ రూ.15వేల విరాళాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు వంకల సోమేశ్వరరావు, సభ్యులు పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం



రెంటికోట రోడ్డులో ప్రమాద సూచికగా ఏర్పాటు చేసిన కర్ర

కాశీబుగ్గ : పలాస నుంచి గొప్పిలిని కలిపే ఆంధ్రా–ఒడిశా రహదారి ప్రమాదకరంగా మారింది. ఎక్కడికక్కడ గోతులు ఏర్పడటంతో వాహనచోదకులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తరచూ ప్రమాదాలు చోటుచేసుకోవడంతో ఈ ప్రాంతంలో కొందరు ప్రమాద హెచ్చరిక సూచికగా ఎర్రటి గుడ్డ కలిగిన కర్రలు ఏర్పాటు చేస్తున్నారు. రెంటికోట కాలనీలో ప్రమాదకర మలుపుదాటిన వెంటనే భారీ గోతులు భయాందోళనకు గురి చేస్తున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి గోతులు పూడ్చాలని వాహనచోదకులు కోరుతున్నారు.

క్రీడలతో మానసిక వికాసం



ఆటల పోటీల్ని ప్రారంభించిన సర్పంచ్ పూడి లక్ష్మణరావు

కవిటి : క్రీడా పోటీలతో శారీరక, మానసిక వికాసం పొందవచ్చని కవిటి సర్పంచ్ పూడి లక్ష్మణరావు అన్నారు. శనివారం కవిటిలో యూటీఎఫ్ స్వర్ణోత్సవాలలో భాగంగా నియోజకవర్గస్థాయి ఆటల పోటీలను ప్రారంభించారు. షటిల్ బ్యాడ్మింటన్, క్రికెట్, వాలీబాల్ తదితర పోటీలను నిర్వహించనున్నట్టు యూటీఎఫ్ ప్రతినిధులు మురళీప్రకాష్, జానకిరావు తదితరులు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో పరివర్తన ఏకాదశి పూజలు



పూజలందుకున్న జగన్నాథుడు

ఇచ్ఛాపురం: స్థానిక జగన్నాథ ఆలయంలో శనివారం పరివర్తన ఏకాదశి పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వేణుగోపాలస్వామికి పంచామృతాలతో అభిషేకాలు చేశారు. స్వామి వారికి తులసీదళాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

గాడి తప్పిన పశువైద్యం

- పశు వైద్యులు లేక పాడి రైతులకు ఇబ్బందులు
- ఇచ్ఛాపురం నియోజకవర్గంలో ఇన్‌చార్జిలతోనే నెట్టుకొస్తున్న వైనం
- ఎమ్మెల్యే సొంత మండలంలో మరింత దుస్థితి



వైద్యులు, సిబ్బంది లేకపోవడంతో మూలకు చేరిన ఈదుపురం పశువైద్య కేంద్రం

ఇచ్ఛాపురం రూరల్ : నియోజకవర్గంలో పశువైద్య సేవలు సక్రమంగా అందక పాడి రైతులు ఇబ్బందులు పడుతున్నారు. జిల్లాకు చెందిన అచ్చెన్నాయుడు పశు వైద్యశాఖ మంత్రి అయినప్పటికీ శాఖాపరంగా సరిపడా సిబ్బంది లేకపోవడంతో పశు వైద్యం అందని ద్రాక్షగానే మిగిలిపోయింది. ఉన్న వైద్యులు సక్రమంగా రాకపోవడం, వారానికి ఓసారి కనిపించే ఇన్‌చార్జి వైద్యులతో నియోజకవర్గంలోని పశువైద్యం కుంటుపడింది. ఇచ్ఛాపురం, సోంపేట పశువైద్య కేంద్రాల్లో రెండు అసిస్టెంట్ డైరెక్టర్లు ఉండేవారు. ఇచ్ఛాపురం ఏడీగా పనిచేసిన డాక్టర్ కె.ప్రసాదరావు ఇటీవల జరిగిన ఎన్నికలు అనంతరం పార్వతీపురం మన్యం జిల్లాకు డిప్యుటేషన్‌పై వెళ్లిపోగా, సోంపేట ఏడీగా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ కె.అప్పలస్వామి ఇచ్ఛాపురం ఇన్‌చార్జి ఏడీగా కొనసాగుతున్నారు. ఈదుపురం పశువైద్యం కేంద్రం వైద్యుడు డాక్టర్ లవ్‌కుమార్ శ్రీకాకుళం నుంచి రాకపోకలు సాగిస్తున్నారు. ఈయన కొళిగాం పశువైద్యానికి ఇన్‌చార్జి వైద్యులుగానూ కొనసాగుతున్నారు.స్థానిక ఎమ్మెల్యే బెందాళం అశోక్ సొంత మండలం కవిటిలో ఒక్క పశువైద్యాధికారి లేకపోవడం గమనార్హం. ఆయన సొంత పంచాయతీ కవిటి, బొరివంక పశువైద్య కేంద్రాలకు కంచిలి మండలం మఖరాంపురం పశువైద్యాధికారి డాక్టర్ జి.కిరణ్‌కుమార్ ఇన్‌చార్జిగా కొనసాగుతున్నారు. కంచిలి మండలంలో ఎంఎస్.పల్లి పశువైద్యాధికారి డాక్టర్ టి.శిరీష కంచిలి పశువైద్య కేంద్రంలో ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు. సోంపేట మండలం మామిడిపల్లి పశువైద్య కేంద్రానికి వైద్యుడు లేకపోవడం, బేసి రామచంద్రాపురం పశువైద్యాధికారి డాక్టర్ బి.శిరీష ప్రసూతి సెలవుల్లో ఉండగా, బారువా పశువైద్యాధికారి డాక్టర్ ఏ.చైతన్య బేసి రామచంద్రాపురం, మామిడిపల్లి పశువైద్య కేంద్రాల్లో ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు. ఇచ్ఛాపురం మండలం డొంకూరు, బి.తోటూరు గ్రామీణ పశువైద్య కేంద్రాల్లో వెటర్నీ అసిస్టెంట్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

గోపాలమిత్రలే దిక్కు..

ఇచ్ఛాపురం నియోజకవర్గంలో 1,83,000 పైగా మూగ జీవాలు ఉన్నాయి. ఆయా గ్రామాల్లో పశువులు రోగాల బారిన పడితే గోపాలమిత్రలే దిక్కుగా మారారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి పశువైద్యాధికారులను, సిబ్బందిని నియమించాలని పాడి రైతులు కోరుతున్నారు.



ఏడీ లేకపోవడంతో తెరుచుకోని ఇచ్ఛాపురం పశువైద్యశాల



వైద్యం అందక మృతి చెందిన గొర్రె వద్ద దీనంగా పశువుల కాపరి

ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి చర్యలు



మాట్లాడుతున్న సీఐ మీసాల చిన్నంనాయుడు

ఇచ్ఛాపురం: పట్టణంలో రోజురోజుకూ పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యను పరిష్కరించడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని సీఐ మీసాల చిన్నంనాయుడు తెలిపారు. ఇచ్ఛాపురం సర్కిల్ కార్యాలయం ఆవరణంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పట్టణంలో అధికంగా ట్రాఫిక్ తలెత్తే కొళిగాం రోడ్డుపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. దీనిలో భాగంగా కొళిగాం- రత్తకన్న-డైలీ మార్కెట్ రోడ్డులో ఎల్‌సీగేట్ నుంచి డైలీమార్కెట్ వరకు ట్రాక్టర్లు, భారీ వాహనాలను ఉదయం 9 నుంచి 12 గంటల వరకు, సాయంత్రం 3 నుంచి 6 గంటల వరకు నిషేధిస్తున్నట్లు ప్రకటించారు. ఆదేశాలను అతిక్రమిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో పట్టణ ఎస్ఐ ఇ.చిన్నంనాయుడు పాల్గొన్నారు.

విధులు బహిష్కరించిన వైద్యులు

- సిబ్బందితోనే సేవలు
- వెలవెలబోయిన పీహెచ్‌సీలు




ఇచ్ఛాపురం రూరల్: నల్ల బ్యాడ్జీతో విధులకు హాజరైన కొళాగాం పీహెచ్‌సీ డాక్టర్ కల్యాణి



టెక్కలి రూరల్: వెలవెలబోతున్న కె.కొత్తూరు ఆస్పత్రి



పలాస: నల్లబ్యాడ్జీలతో విధులు నిర్వహిస్తున్న వైద్యులు సిబ్బంది



కంచిలి: వైద్యుల చాంబర్ తెరవకపోవడంతో ఓపీ వద్ద కూర్చున్న రోగి

ఇచ్ఛాపురం రూరల్: పీజీ వైద్య విద్యలో ఇన్ సర్వీస్ కోటా కుదింపును వ్యతిరేకిస్తూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు ఆందోళన బాటపట్టారు. ఏపీ పీహెచ్‌సీ వైద్యుల సంఘం ఇచ్చిన పిలుపు మేరకు శనివారం ఈదుపురం, కొళిగాం పీహెచ్‌సీల్లో అత్యవసర వైద్య సేవలు మినహా మిగిలిన సేవలను బహిష్కరించారు.

టెక్కలి రూరల్: టెక్కలి మండలం కె.కొత్తూరు పీహెచ్‌సీలో వైద్యులు విధులు బహిష్కరించారు. దీంతో రోగులు సిబ్బంది ఇచ్చే మందులు తీసుకుని ఇంటికి వెళ్లిపోతున్నారు. శనివారం సుమారు 40 మంది వరకు రోగులు వైద్యం కోసం వచ్చినా వైద్యులు అందుబాటులో లేక ఇంటిముఖం పట్టారు.

కంచిలి: కంచిలి పీహెచ్‌సీలో ఇద్దరు వైద్యులూ సమ్మెలో ఉండటంతో స్థానికంగా ఉన్న వైద్య సిబ్బందే రోగులకు సేవలందిస్తున్నారు.

పలాస: పలాస నియోజకవర్గంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేస్తున్న వైద్యులు శనివారం సేవలను నిలుపుదల చేస్తూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన తెలియజేశారు. జీఓ 85 రద్దు చేయాలని డిమాండ్ చేశారు. నల్ల బ్యాడ్జీలను ధరించి అత్యవసర సేవలను మాత్రమే కొనసాగించారు. కార్యక్రమంలో డాక్టర్ సునీల్‌కుమార్, డాక్టర్ ఎం.విజయ్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలి



స్థానికులతో మాట్లాడుతున్న మానవహక్కుల వేదిక ప్రతినిధులు

సోంపేట : మండలంలోని శారదాపురంలో ఇటీవల కల్తీసారా తాగిన ఘటనలో పలువురు మృతి చెందినట్టు సమాచారం రావడంతో మానవహక్కుల వేదిక ఆధ్వర్యంలో విచారణ బృందం శనివారం గ్రామంలో పర్యటించింది. ఈ సందర్భంగా మానవహక్కుల వేదిక ప్రతినిధి కె.వి.జగన్నాథరావు మాట్లాడుతూ కల్తీసారా కాటుకు బలైన వారి కుటుంబాలకు ప్రభుత్వం తక్షణమే ఎక్స్‌గ్రేషియా ప్రకటించి ఆదుకోవాలని కోరారు. అనంతరం ఘటన పూర్వాపరాలపై విచారణ బృందం ఆరాతీశారు.

పరామర్శ



శ్రీను కుటుంబసభ్యుల్ని పరామర్శించిన నాయకులు

సోంపేట: మండల కేంద్రం సోంపేటకు చెందిన జుత్తు శ్రీను తల్లి ఇటీవల మృతిచెందడంతో ఆ కుటుంబాన్ని సోంపేట జెడ్పీటీసీ తడక యశోద, పలాసపురం సర్పంచ్ తడక జోగారావు శనివారం పరామర్శించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ నర్తు జోగారావు, వార్డు మెంబర్ దొండపాటి శ్రీను, సంగారు గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

44 ఆవులు స్వాధీనం

కంచిలి: మండలంలో వేర్వేరు చోట్ల కంచిలి పోలీసులు మూగజీవాల అక్రమ రవాణాను అడ్డుకున్నారు. లక్ష్మీపురం గ్రామం పరిధి పాతాళేశ్వర ఆలయం వెనుక కొండ పక్కన ఖాళీస్థలంలో రవాణాకు సిద్ధం చేసిన 32 ఆవుల్ని పోలీసులు శుక్రవారం రాత్రి స్వాధీనం చేసుకొన్నారు. అదేవిధంగా కంచిలి రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద ఒడిశా రాష్ట్ర పరిధి నౌగాం గ్రామం నుంచి 12 ఆవుల్ని రవాణా చేస్తుండగా పోలీసులు అడ్డుకొన్నారు. ఈ రవాణాకు పాల్పడిన వారిలో మొదటి కేసుకు సంబంధించి గొల్లకంచిలికి చెందిన ఎం.భాస్కరరావు, రెండో కేసులో నౌగాం గ్రామానికి చెందిన ఇద్దరిపైన వేర్వేరుగా కేసులు నమోదు చేసినట్లు స్థానిక ఎస్ఐ జి.రాజేష్ స్థానిక విలేకర్లకు తెలిపారు.

దండాలయ్యా..ఉండ్రాలయ్యా..



ఇచ్ఛాపురం: కుంకుమ పూజ చేస్తున్న మహిళలు



కంచిలి: ఊరేగింపులో డ్యాన్సు చేస్తున్న యువత



ఇచ్ఛాపురం రూరల్: సన్యాసిపుట్టుగలో వినాయక విగ్రహం ఊరేగింపు



పలాస: అంబేద్కర్ నగర్‌లో కుంకుమ పూజలు



టెక్కలి రూరల్: ఎన్టీఆర్ కాలనీలో 4వ లైన్‌లో 51వంటకాలతో నైవేద్యం

ఇచ్ఛాపురం రూరల్: మండలంలో శనివారం గణేశ్ నిమజ్జనోత్సవాలు ఘనంగా జరిగాయి. స్థానిక బాహుదానది, సముద్రంలో విగ్రహాలను భక్తులు నిమజ్జనం చేశారు. తిప్పనపుట్టుగలో లడ్డూ వేలాం పాటలో కొయ్యా బ్రదర్స్ రూ.60వేలకు లడ్డూను దక్కించుకున్నారు.

ఇచ్ఛాపురం: స్థానిక గవర్నమెంట్ ఆస్పత్రి రోడ్డులోని ఏర్పాటు చేసిన మహాగణపతి మండపం వద్ద మహిళలు కుంకుమ పూజలు నిర్వహించారు.

టెక్కలి రూరల్: టెక్కలిలోని ఎన్టీఆర్ కాలనీ, శ్రీనివాసనగర్, తెంబూరు రోడ్డు, మెట్టవీధులతో పాటు పెద్దసాన తదితర గ్రామాల్లో వినాయక మండపాల వద్ద అన్నదానం నిర్వహించారు.

కంచిలి: కంచిలి పంచాయతీ పరిధి బలియాపుట్టుగ కాలనీలో లైబ్రరీ మైదానంలో పూజలందుకొన్న గణనాథుని విగ్రహాన్ని, గొల్లకంచిలి, బలియాపుట్టుగ గ్రామాల గణనాథులను శుక్రవారం రాత్రి నిమజ్జనం చేశారు. యువత సందడి చేశారు.

పలాస: కాశీబుగ్గ అంబేద్కర్ నగర్‌లో సింహగర్జన యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద కుంకుమ పూజలు నిర్వహించారు.

లోక్ అదాలత్‌కు విశేష స్పందన



సోంపేట: లోక్ అదాలత్ నిర్వహిస్తున్న దృశ్యం



కోటబొమ్మాళి: మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి ప్రసన్నలత

సోంపేట: సోంపేట కోర్టు ఆవరణలో శనివారం నిర్వహించిన లోక్ అదాలత్‌లో వివిధ అంశాలకు సంబంధించిన 48 కేసులను రాజీమార్గంలో పరిష్కరించినట్టు కోర్టు వర్గాలు వెల్లడించాయి. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి జె.శ్రీనివాసరావు, జూనియర్ సివిల్ జడ్జి పి.పరేష్‌కుమార్, న్యాయవాదులు రుక్మాంగదుడు, ఏకేవీవీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కోటబొమ్మాళి: కోటబొమ్మాళి కోర్టులో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 106 కేసులు రాజీ అయినట్లు జూనియర్ సివిల్ జడ్జి బి.ఎం.ఆర్.ప్రసన్నలత తెలిపారు. కార్యక్రమంలో బార్ అధ్యక్షుడు లఖినేని శ్రీనివాసులు, ఏజీపీ ఎస్.తిరుపతి, ఏపీపీ డి.హరిప్రియ, న్యాయవాదులు కె.అచ్చెన్నాయుడు, వి.అప్పలనాయుడు, పల్లి వాసు, యు.తిరుమలరావు, పి.అర్జునరావు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం: స్థానిక కోర్టు ఆవరణలో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్ ద్వారా 33 కేసులను జూనియర్ సివిల్ జడ్జి పి.పరేష్‌కుమార్ పరిష్కరించారు. కార్యక్రమంలో సోషల్ వర్కర్ భారతిదివ్య, బార్ అధ్యక్షుడు రమణయ్య రెడ్డి, న్యాయవాదులు ప్రహ్లాదరెడ్డి, ఎస్.రంగారావు, నాగరాజు పాత్రో, మనోజ్ కుమార్ సామంతో, మురళి, వేణు, భగవాన్‌దాస్, ఎస్ఎల్ఎన్.ప్రసాద్, ప్రేమలతాదేవి పాల్గొన్నారు.

టెక్కలి: టెక్కలి కోర్టు సముదాయంలో ఇన్‌చార్జి సీనియర్ సివిల్ జడ్జి (ఎఫ్ఏసీ), జూనియర్ సివిల్ జడ్జి (ఎఫ్ఏసీ) సీహెచ్.హరిప్రియ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 144 కేసులు పరిష్కరించారు. కార్యక్రమంలో సభ్యులు ఆర్.రాజేశ్వరరావు, బి.గౌరీపతి, బి.శ్రీనివాసరావు, బార్ అసోషియేషన్ అధ్యక్షుడు డి.వివేకానంద తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా క్రీడా పోటీలు



కోటబొమ్మాళి: పోటీలు ప్రారంభిస్తున్న యూటీఎఫ్ ప్రతినిధులు

కోటబొమ్మాళి: యూటీఎఫ్ స్వర్ణోత్సవ సంబరాల్లో భాగంగా కోటబొమ్మాళి-సంతబొమ్మాళి మండలాల ఉపాధ్యాయులకు శనివారం కోటబొమ్మాళి ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో క్రీడా పోటీలు నిర్వహించారు. క్రికెట్, షటిల్ బ్యాడ్మింటన్, చెస్, క్యారం పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కిషోర్, జిల్లా కార్యదర్శి శ్రీరామ్మూర్తి, ప్రతినిధులు గొండు నారాయణరావు, మెండ గోవిందరావు, వై.వాసుదేవరావు, కమలాబాయి పాల్గొన్నారు.

కాశీబుగ్గ: కాశీబుగ్గ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మందస, పలాస, వజ్రపుకొత్తూరు మండలాల ఉపాధ్యాయులకు యూటీఎఫ్ ఆధ్వర్యంలో క్రీడా పోటీలు నిర్వహించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సంఘ జిల్లా కార్యదర్శి గున్న రమేష్, రాష్ట్ర కౌన్సిలర్ బల్ల చిట్టిబాబు, జిల్లా పూర్వ కార్యదర్శి కంచరాన రమేష్, దాసరి ఈశ్వరరావు, జగదీష్, సిద్దు, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

నరేంద్రనాథ్‌కు సత్కారం



హెచ్‌ఎం నరేంద్రనాథ్ పట్నాయక్‌ను సత్కరిస్తున్న దృశ్యం

ఇచ్ఛాపురం రూరల్: హిందీ దివస్‌లో భాగంగా శనివారం శ్రీకాకుళంలో నిర్వహించిన హిందీ శోభా యాత్రలో కొళిగాం ఉన్నత పాఠశాల హెచ్ఎం, జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడు నరేంద్రనాథ్ పట్నాయక్‌ను ఘనంగా సత్కరించారు. హిందీ భాషాభివృద్ధికి చేస్తున్న కృషిని ఆర్జేడీ విజయభాస్కర్ కొనియాడారు

ఆకట్టుకున్న దీపాలంకరణ



టెక్కలి శ్రీనివాసనగర్‌లో 3,333 దీపాలతో అలంకరణ



టెక్కలి లక్ష్మీ నృసింహాలయం వద్ద దీపాలంకరణ

టెక్కలి: వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి టెక్కలిలో పలు ప్రాంతాల్లో నిర్వహించిన దీపాలంకరణ ఆకట్టుకున్నాయి. శ్రీనివాసానగర్‌లో కొండ గుహల వినాయకుడి వద్ద 3,333 దీపాలు వెలిగించారు. లక్ష్మీ నృసింహ ఆలయం వద్ద భక్తిశ్రద్ధలతో దీపారాధన నిర్వహించారు.

సంక్షిప్తంగా...

కారు ఢీకొని ఇద్దరికి తీవ్ర గాయాలు

కాశీబుగ్గ: టెక్కలి మండలం చలమయ్యపేట జాతీయ రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. కారు, ద్విచక్ర వాహనం పరస్పరం ఢీకొట్టంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. బైక్‌పై ఉన్న యువకులు ఎగిరిపడ్డారు. వెంటనే స్థానికులు స్పందించి క్షతగాత్రులను అంబులెన్సులో టెక్కలి జిల్లా ఆసుపత్రికి తరలించారు. వీరిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. వీరి స్వస్థలాలు బ్రాహ్మణతర్లా, కాశీబుగ్గ పొందర వీధి కాగా.. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

పూర్వ విద్యార్థుల ఔదార్యం

వజ్రపుకొత్తూరు రూరల్: ఒంకులూరు గ్రామానికి చెందిన కిడ్నీ బాధితుడు లైౖట్టి ఢిల్లీరావుకు శనివారం పూర్వ విద్యార్థులు రూ.31,700 ఆర్థిక సాయం అందించి అండగా నిలిచారు. ఢిల్లీరావు కొంతకాలంగా కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నాడు. విషయం తెలుసుకున్న వంకులూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల(1993–94)లో 10వ తరగతి పూర్వ విద్యార్థులు విరాళాలు సేకరించి మనోధైర్యాన్ని నింపారు.

కొత్తమ్మతల్లి జాతర ప్రత్యేకాధికారిగా రమేష్‌బాబు



కోటబొమ్మాళి: అక్టోబర్ 1 నుంచి 3వ తేదీ వరకూ జరగనున్న కోటబొమ్మాళి కొత్తమ్మతల్లి జాతర ప్రత్యేకాధికారిగా దేవదయశాఖ ఉప కమిషనర్, అరసవిల్లి దేవాలయం ఈఓ డి.ఎల్.వి.రమేష్‌బాబును ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు శనివారం రమేష్‌బాబు కొత్తమ్మతల్లి ఆలయానికి వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం జాతర టికెట్లు, క్యూలైన్లు, తాగునీరు, ఉచిత ప్రసాదం తదితర ఏర్పాట్లపై ఈఓ వి.రాధాకృష్ణతో సమీక్షించారు.